క్లుప్తంగా

ఆలయ కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న గ్రామస్తులు

కుంటాల: మండలంలోని ఓలా శివాలయం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేదరి గణపతి, కోశాధికారిగా కట్ట రవి, కార్యదర్శిగా తుమ్మల రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

ఆలయ వార్షికోత్సవం

కుంటాల: మండలకేంద్రంలోని శ్రీకృష్ణ దేవాలయ తొమ్మిదో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము న ఐదు గంటలకు అభిషేకం, ఏడు గంటలకు హారతి, ఎనిమిది గంటలకు లక్ష్మీఅష్టోత్తర, విష్ణు సహస్రనామ అష్టోత్తరం, 11:10 గంటలకు శ్రీ రాధాకృష్ణ కల్యాణం, హారతి, తీర్థ ప్రసాద వితరణ, పవలింపు సేవ తదితర పూజాది కార్యక్రమాలు చేపట్టారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి యథావిధిగా ప్రజావాణి

నిర్మల్: కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. శాసనమండలి ఎన్నికల కోడ్ కారణంగా కొన్ని వారాలపాటు నిలిచిన ప్రజావాణిని తిరిగి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను ప్రతీ సోమవారం ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

గజ్జలమ్మ దేవికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, ధర్మాబాద్ బోకర్, ఇస్లాపూర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. తలనీలాలు, తులాభారం(బంగారం) మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

వాహనపత్రాలు వెంట ఉంచుకోవాలి



బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష చేస్తున్న పోలీసులు

లక్ష్మణచాంద: వాహనదారులు తప్పనిసరిగా తమ వెంట డ్రైవింగ్ లైసెన్స్, బీమా తదితర ధ్రువపత్రాలను ఉంచుకోవాలని పోలీసులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రాచాపూర్ సమీపంలో పోలీస్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేసి ధ్రువపత్రాలు పరిశీలించారు. డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పీసీలు సంతోష్, సందీప్, భూమన్న, మారుతి, గంగాధర్ తదితరులు ఉన్నారు.


14న విషుపూజ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని గాంధీచౌక్ ఏరియాలో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ఈనెల 14న శుక్రవారం విషుపూజ నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప సేవాసమితి కార్యవర్గ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలివచ్చి పాల్గొనాలని కోరారు.

మాజీ మంత్రి పరామర్శ

సారంగాపూర్: అనారోగ్యంతో ఇటీవల కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన మండలంలోని వంజర్ గ్రామ మాజీ సర్పంచ్ గోనె లక్ష్మణ్‌ను మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం లక్ష్మణ్ ఇంటికి వెళ్లి ఆరోగ్యం గురించి వివరాలు తెలుసుకున్నారు. పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మహిపాల్ రెడ్డి, నిర్మల్ ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీకాంత్ యాదవ్, రాజేందర్, భూమేశ్, మహేశ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



సాయాగౌడ్(ఫైల్)

ముధోల్: మండలంలోని తరోడా గ్రామ మాజీ సర్పంచ్ మద్దెకుంట సాయాగౌడ్(68)అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఈయన గతంలో తరోడా గ్రామపంచాయతీకి ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికయ్యాడు. ఈయనకు భార్య రమ, కొడుకు స్వామిగౌడ్ ఉన్నారు. గ్రామంలోనే అంత్యక్రియలు నిర్వహించగా పలు గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

నిర్వహణ లోపం.. మొక్కలకు శాపం



లక్ష్మణచాంద: గత ప్రభుత్వ హయాంలో మండలకేంద్రం నుంచి పొట్టపెల్లి వెళ్లే మార్గంలో డబుల్ రోడ్డుకు ఇరువైపులా అధికారులు నాటించిన మొక్కలు నేడు ఏపుగా పెరిగాయి. కానీ పెరిగిన వాటిని సంరక్షించడంలో అధికారులు విఫలమయ్యారు. వాటి నీడ తమ పంట చేన్లలో పడుతుందని కొందరు రైతులు ఈ చెట్లకు నిప్పు పెడుతున్నారు. అధికారులు స్పందించి మొక్కలను కాపాడాలని మండలవాసులు కోరుతున్నారు.

మరుగుదొడ్డి ఉన్నా.. నీళ్లులేవ్

లోకేశ్వరం: మండలంకేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో నిర్మించిన మరుగుదొడ్డికి నీరు రాక.. తలుపులు లేక నిరుపయోగంగా మారింది. దీంతో బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు ఒంటికి, రెంటికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు.



ఆహ్లాదం పంచుతూ..



లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్-వడ్యాల్ గ్రామాల మధ్య ఉన్న చెరువు వద్ద ఆదివారం సాయంత్రం అస్తమించే సూర్యుడు ఆహ్లాదం పంచుతూ ఆకట్టుకున్నాడు. సంధ్యా వేళ భానుడి కిరణాలు చెరువుపై పడటంతో అందులోని నీళ్లు ఎరుపు రంగు మాదిరి కనువిందు చేశాయి.

కొత్త సారథులొస్తున్నారు..

- నెలఖారులోగా మహిళా సంఘాలకు ఎన్నికలు
- నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- ఇప్పటికే ఏపీఎం, సీసీలు, సిబ్బందికి శిక్షణనిచ్చిన అధికారులు



లక్ష్మణచాందలో సమావేశమైన మహిళా సంఘం సభ్యులు, సిబ్బంది

లక్ష్మణచాంద: మహిళలు సభ్యులుగా ఉన్న స్వయం సహాయక సంఘాలకు కొత్త సారథులను ఎన్నుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సంఘం సభ్యుల నుంచే గ్రామ, మండల, జిల్లా సమాఖ్యలకు నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షురాళ్లను ఎన్నుకునే ప్రక్రియను ఈనెలాఖరులోగా జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు ఏపీఎంలు, సీసీలకు, ఇతర సిబ్బందికి అవసరమైన శిక్షణనిచ్చారు. శిక్షణ పొందిన అధికారులు గ్రామస్థాయిలో కొత్త సారథుల ఎన్నికపై గ్రామైక్య సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు.

వారే కీలకం...

ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. చిరువ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడంతోపాటు పొదుపు పాతాలు అలవర్చుకుంటున్నారు. ప్రతి నెల తప్పనిసరిగా వాయిదాల పద్ధతిన శ్రీనిధి రుణాలను బ్యాంకులో జమ చేస్తున్నారు. ఈ ప్రక్రియలో అధ్యక్ష, ఉపాధ్యక్షురాళ్ల పాత్ర ఎంతో కీలకమైనదిగా చెప్పవచ్చు.

ఈసారి అవకాశం ఎవరిదో..

ప్రతి స్వయం సహాయక సంఘం(ఎస్‌హెచ్‌జీ)లో కనీసం 10 నుంచి 15 మంది సభ్యులు ఉంటారు. అధ్యక్ష, ఉపాధ్యక్షురాళ్ల ఎన్నికకు నిబంధనల ప్రకారం ఆసక్తి ఉన్న సభ్యులకు సమావేశం నిర్వహించి.. ఏకగ్రీవంగా గాని, చేతులు పైకెత్తడం ద్వారా గాని, చీటీలు రాసి మద్దతు ప్రకటించడం వంటి మూడు పద్ధతుల్లో ఎన్నుకుంటారు. వీటిల్లో ఏదైనా ఒక విధానం ద్వారా అధ్యక్ష, ఉపాధ్యక్షురాళ్లను ఎన్నుకుంటారు. గ్రామంలోని స్వయం సహాయ సంఘాల నుంచి ఒకరిని గ్రామ సమాఖ్య అధ్యక్షురాలిగా, గ్రామ సంఘాల అధ్యక్షుల నుంచి మండల సమాఖ్య అధ్యక్షురాలిగా, మండల సమాఖ్య అధ్యక్షురాల నుంచి జిల్లా సమాఖ్యకు అధ్యక్షులను ఎన్నుకుంటారు.

ప్రారంభమైన ఎన్నికల ప్రక్రియ..

జిల్లా సమాఖ్య అధ్యక్షురాలి ఎంపిక ప్రక్రియ ప్రారంభమైందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే శిక్షణ పొందిన ఏపీఎంలు, సీసీలు జిల్లాలోని వివిధ గ్రామాల్లో గ్రామ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపిక చేపడుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నెలఖారులోగా గ్రామ, మండల అధ్యక్షుల ఎంపిక అనంతరం జిల్లా సమాఖ్య అధ్యక్షురాలి ఎంపిక ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

జిల్లా వివరాలు..	
గ్రామైక్య సంఘాలు	: 504
మండల సమాఖ్య సంఘాలు	: 18
మొత్తం సభ్యులు	: 1,36,000

కొత్త వారికి అవకాశం కల్పించాలి



రెండేళ్లకోసారి గ్రామ, మండల, జిల్లా సమాఖ్యలకు అధ్యక్షురాళ్లను ఎన్నుకుంటారు. ఎప్పుడూ ఒకరే కాకుండా కొత్తవారికి అందరికీ అవకాశం కల్పించాలి.

– గంగామణి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు

ఈనెలలోనే పూర్తి

జిల్లాలోని మహిళా సమాఖ్య ఎన్నికలు ఈనెలలోనే పూర్తి చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే గ్రామస్థాయిలో సమాఖ్య ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది.

– జ్ఞాను, సీనియర్ డీపీఎం

గ్రామాల అభివృద్ధికి కృషి

- కేంద్రం నుంచి నిధులు తీసుకొస్తున్నా..
- నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్‌రూరల్: గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. కేంద్రం ప్రభుత్వ నిధులు రూ.25 కోట్ల నిధులతో నిర్మల్‌రూరల్ మండలంలోని చిట్యాల్ గ్రామం నుంచి గాంధీనగర్ వరకు నిర్మించే బీటీ రోడ్డు పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిట్యాల్ గ్రామస్తులు తనకు ఎల్లప్పుడూ అండగా ఉన్నారని.. ఆ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్రం సహకరించకుంటే కేంద్రం నుంచి నిధులు తీసుకొస్తున్నానని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణం రెండు నెలలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దిలావర్‌పూర్ మండలం మాయాపూర్ బ్రిడ్జి కూలేలా ఉందని.. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి నెల రోజుల్లోగా రూ.50 లక్షల నిధులు తెచ్చి పనులు ప్రారంభిస్తామన్నారు. గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని పలు ఆలయాల్లో పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మార గంగారెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, జమాల్, భూపాల్ రెడ్డి, ముత్యంరెడ్డి, భూపతిరెడ్డి, అశ్వత్థామ, రాజేశ్వర్, ముత్యం, కార్తీక్, సాయి పాల్గొన్నారు.

క్రీడలతో ఆత్మస్థైర్యం, స్నేహభావం



విజేతకు కప్ అందిస్తున్న ఎస్సై శంకర్

దస్తురాబాద్: ఆటలు ఆడితే ఆత్మస్థైర్యం, స్నేహభావం పెంపొందుతాయని ఎస్సై శంకర్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రాంపూర్ గ్రామంలో జరిగిన మండలస్థాయి ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో శివాజీ వారియర్స్.. రామ్ సేన వారియర్స్‌పై గెలుపొందింది. విజేత జట్టుకు ఎస్సై కప్‌ను అందించగా.. కాంగ్రెస్ నాయకుడు గాజర్ల రాజేశం రూ.10వేలు, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.5వేలను అందించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రాజునాయక్, బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మణ్, నాగరాజు, గోపి తదితరులు ఉన్నారు.

నేడు ప్రతిష్ఠాపన

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధి ఇప్పమాడలో సోమవారం అభయాంజనేయ స్వామి, శివపంచాయతన, నవగ్రహ, ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, నాయకులు హాజరవుతారని భక్తులు రావాలని కోరారు.

వ్యాయామం చేస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలి



2కే రన్‌లో వాలా అసోసియేషన్ సభ్యులు

నిర్మల్‌టౌన్: ప్రతిరోజు వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని నిర్మల్ పట్టణ వాకర్స్ అండ్ లాఫింగ్ (వాలా) అసోసియేషన్ అధ్యక్షుడు నాలం శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో వాలా అసోసియేషన్ ఆధ్వర్యంలో 2కే రన్‌ను ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ రన్ ప్రధాన వీధుల గుండా సాగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వాకర్స్‌కు వివిధ ఆటలపోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ వాకింగ్, లాఫింగ్ అలవాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌లో జిల్లా టీచర్లు



పాల్గొన్న మహిళా ఉపాధ్యాయిలు

నిర్మల్‌రూరల్: హైదరాబాద్‌లోని కాచిగూడలో ఆదివారం జరిగిన ఉమెన్ లీడర్స్ వర్క్‌షాప్‌లో జిల్లాకు చెందిన ఎస్టీయూ సంఘ మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇందులో మహిళా ఉపాధ్యాయులకు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి వివరించారు. ఉత్తమ ఉపాధ్యాయులే..ఉత్తమ నాయకులుగా ఎదుగుతారని దిశానిర్దేశం చేశారు. అనంతరం పలు పోటీలు నిర్వహించగా జిల్లా ఉపాధ్యాయులు బహుమతులు గెలుపొందారు. ఇందులో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పర్వతరెడ్డి, సదానందంగౌడ్, జిల్లా మహిళా ప్రతినిధులు శ్రీదేవి, మీనారాణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. గుంతలతో ముప్పు



తానూరు: మండలంలోని హిప్నెల్లి ఎక్స్‌రోడ్డు నుంచి హంగిర్గా గ్రామం వెళ్లే మార్గంలో బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి గుంతలు కన్పించక పలువురు కింద పడుతూ ఆసుపత్రి పాలవుతున్నారు. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: సునీల్, ఆర్‌అండ్‌బీ డీఈ, ఫోన్: 84649 60600

నర్సరీల్లో చలువ పందిళ్లు

- ఎండల నుంచి రక్షణకు చర్యలు
- మొక్కల పెంపకం పర్యవేక్షిస్తున్న అధికారులు



ధర్మోర నర్సరీలో ఏర్పాటు చేసిన పందిరి



లోకేశ్వరం నర్సరీలో చలువ పందిరి కింద పెరుగుతున్న మొక్కలు

లోకేశ్వరం: రాష్ట్రంలో అడవులశాతం పెంచేందుకు ప్రభుత్వం వనమహోత్సవంలో భాగంగా ప్రతి పంచాయతీకో నర్సరీ ఏర్పాటు చేసింది. ఒక్కో నర్సరీలో 12వేల మొక్కలను పెంచుతూ వాటి నిర్వహణ బాధ్యతలను పంచాయతీలకే అప్పగించారు. అందులో పెంచే వివిధ రకాల మొక్కలను ప్రభుత్వ స్థలాల్లో, రోడ్ల పక్కన, చెరువు కట్టలపై, విద్యాలయాల్లో నాటనున్నారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఎండిపోకుండా చర్యలు..

ఎర్రమట్టి, రేగడిమట్టి, ఇసుక, సెగ్రిగేషన్ షెడ్లలో తయారైన సేంద్రియ ఎరువు, సూపర్‌ఫాస్ఫేట్ మిశ్రమాన్ని కవర్లలో నింపి అందులో విత్తనాలు నాటారు. మొలకెత్తని విత్తనాల స్థానంలో కొత్తవి నాటుతున్నారు. కలుపు నివారణ చర్యలు చేపడుతూ ఏపుగా పెరిగిన మొక్కలను పెద్ద కవర్లలోకి మారుస్తున్నారు.

ఎండలను తట్టుకునేలా..

ప్రస్తుతం వేసవికాలం కావడంతో ఎండలు తీవ్రమయ్యాయి. దీంతో నర్సరీల్లో చిన్నమొక్కలు ఎండిపోకుండా నీడ కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. తరచూ నీటి తడులు అందించేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. చెదలు పట్టకుండా గెమాగ్జిన్ పౌడర్ చల్లుతున్నారు. లోకేశ్వరం మండలంలోని 25 గ్రామపంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. ఒక్కో నర్సరీలో 12 వేల చొప్పున మండలంలో మొత్తం 3 లక్షల మొక్కలను పెంచుతున్నారు. వచ్చే వర్షాకాలంలో వనమహోత్సవంలో భాగంగా ఈ మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తడులు అందిస్తున్నాం



మండలంలో 25 నర్సరీల్లో మూడు లక్షల మొక్కలు పెంచుతున్నాం. ఎండలను దృష్టిలో ఉంచుకొని చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం. ఉపాధి కూలీలతో కలుపు మొక్కలను తీయిస్తున్నాం. మొక్కలు ఎండిపోకుండా నీటి తడులు అందిస్తున్నాం.

– జగన్నాథ్, ఏపీవో

సూచనలు చేస్తున్నాం



వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. నర్సరీలను పరిశీలిస్తూ మొక్కల పెంపకానికి అవసరమైన సలహాలు, సూచనలను సిబ్బందికి అందిస్తున్నాం.

– వెంకటరమేశ్, ఎంపీడీవో

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

భైంసాటౌన్: ఇటీవల పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడంపై ఆదివారం ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్‌ను ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యేను కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ నాయకులు తదితరులున్నారు.